# తరుగుతున్న ఉపాధి – పెరుగుతున్న నిరుద్యోగం – పాలకుల వంచన

**దేశవ్యాపితంగా** నిరుద్యోగం యువతను పట్టిపీడిస్తున్నది. ఉద్యోగ, ఉపాధి లేక వారు నిరాశా నిస్పృహలకు గురౌతున్నారు. 'స్వాతంత్ర్యం' వచ్చి 72 సంవత్సరాలైనా గ్రామీణ, పట్టణ పేదలకు ఉపాధి, చదువు పూర్తిచేసిన యువతకు ఉద్యోగాలు కల్పించటంలోనూ కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్దేశపూర్వక వైఫల్యం పొందాయి. భవిష్యత్తు అంధకారంగా మారి, కుటుంబానికి భారంగా మారానన్న మానసిక వ్యధకు లోనై అనేకమంది యువకులు బలవన్మరణాలకు లోనౌతున్నారు.

ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, పేదల జీవన ప్రమాణాలు పెంచుతామని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని చెబుతూనే వున్నారు. అది మాటలకు పరిమితమే తప్ప ఆచరణలో అందుకు తీసుకోవాల్సిన చర్యలు, విధానాలు చేపట్టటంలేదు. సామ్రాజ్యవాదులకు ఊడిగం చేస్తున్న పాలకులకు దేశ ప్రయోజనాలు, ప్రజల సమస్యల పరిష్కారం పట్టటంలేదు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ప్రజల అవసరాలను తీర్చే పరిశ్రమలు నెలకొల్పకుండా సామ్రాజ్యవాద దేశాల బడాపరిశ్రమాధిపతుల ప్రయోజనాలకు అనుకూలమైన పారిశ్రామిక విధానాన్ని అమలు జరుపుతున్నారు. ఫలితంగా పారిశ్రామిక అభివృద్ధి ప్రక్కదారి పట్టి ఉపాధిలేమి, నిరుద్యోగ సమస్య తీవ్రరూపం దాల్చింది.

యుపిఏ ప్రభుత్వం మాటలగారడీతో యువతను మభ్యపెట్టి మోసం చేసిందేతప్ప ఉద్యోగాలు కల్పించలేకపోయింది. యువతలో గూడుకట్టుకొన్న నిరాశ, నిస్పృహను బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ కూటమి 2014 సాధారణ ఎన్నికల్లో తనకు అనుకూలంగా మార్చుకొంది. తాము అధికారంలోకి వస్తే యువతకు ఉపాధి కల్పిస్తామని, సంవత్సరానికి రెండుకోట్ల ఉద్యోగాలు యిస్తామని చెప్పి వారిని భ్రమలకు గురిచేసింది. అందుకు 'గుజరాత్'ని ఉదాహరణగా చూపింది. తెలుగుదేశం పార్టీ కూటమి కూడా ఇలాంటి వాగ్దానమే చేసింది. సంవత్సరానికి 5 లక్షలు ఉద్యోగాలు కల్పిస్తానని చెప్పింది.

కేంద్రంలో ఎన్‌డిఏ, రాష్ట్రంలో తెలుగుదేశం కూటములు మెజారిటీ స్థానాలతో 2014 సం॥లో ప్రభుత్వాలు ఏర్పాటు చేశాయి. అధికారపగ్గాలు చేపట్టిన తర్వాత ఉద్యోగ కల్పనలో యువతకు మొండిచేయి చూపాయి. ఉద్యోగాలు కల్పించక పోగా భారీగా వున్న ఉద్యోగాలను కూడా భర్తీచేయలేదు. ఉన్నత ఉద్యోగాలు ఊడబెరికే విధానాలు అమలుజరిపాయి.

భారీ పరిశ్రమలకన్నా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలే ఎక్కువగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. మనదేశంలో ఇలాంటి పరిశ్రమలు 6.5 కోట్ల వరకు వున్నాయి. ఇవి 12 కోట్లమందికి ఉద్యోగ, ఉపాధి కల్పిస్తున్నాయి. ఈ పరిశ్రమల రంగం వాటా స్థూలదేశీయ ఉత్పత్తిలో(జిడిపి)లో 29 శాతంగా వుంది. కొత్తగా కొన్ని పరిశ్రమలు ఏర్పడుతున్నా, మూతపడే పరిశ్రమలే ఎక్కువగా వున్నాయి. రిజర్వుబ్యాంక్ గణాంకాల ప్రకారమే 4,86,291 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూలబడ్డాయి. ఈ పరిశ్రమలు 2013-14 సంవత్సరంలో 9.17 శాతం వార్షిక అభివృద్ధి సాధించగా 2015-16 నాటికి 7.62 శాతానికి పడిపోయింది. ఆ తర్వాత 6 శాతానికి దిగజారింది. ఇందుకు కారణం పాలకుల విధానాలే. ఈ పరిశ్రమలు నిలదొక్కుకొని అభివృద్ధిచెందటానికి చేయూత ఇవ్వకుండా వాటి మనుగడను దెబ్బతీసే విధానాలు అమలుపర్చారు. ఇవి అభివృద్ధి చెందితే తమకు తీవ్రనష్టంగా పరిణమిస్తుందని బడాపరిశ్రమాధిపతులు, అవి ఉత్పత్తి చేసే సరుకులకు మార్కెట్ సంక్షోభాన్ని సృష్టించాయి.

పాలకుల పారిశ్రామిక విధానాల ఫలితంగా నిరుద్యోగ సమస్య నానాటికీ పెరుగుతూనే వుంది. జాతీయ నమూన సర్వే సంస్థ (ఎన్‌ఎస్‌ఎస్) నియతకాలిక సర్వే నివేదికను ఓ పత్రిక ప్రచురించింది. నిరుద్యోగిత రేటు 6.1శాతం అన్న విషయాన్ని బయటపెట్టింది. గత 45 సం॥కాలంలో ఇదే ఎక్కువ అని పేర్కొంది. పత్రిక ప్రచురించిన దానిపై ఆనాటి కేంద్ర గణాంకాలశాఖ మంత్రి సదానందగౌడ లోక్‌సభలో స్పందిస్తూ అది నకిలీ నివేదికగా ప్రకటించాడు. ఆయన ప్రకటన వాస్తవ విరుద్ధమని వెల్లడైంది. మోడీ నాయకత్వంలోని ఎన్‌డిఏ కూటమి రెండవసారి కొలువుదీరిన మరుసటిరోజే కేంద్ర గణాంకాలశాఖ ఎన్‌ఎస్ఎస్‌ఓ నియతకాలిక కార్మిక సర్వే వివరాలను విడుదల చేసింది. దానిలో నిరుద్యోగిత రేటు 6.1% నమోదైంది. పత్రిక ప్రచురించింది వాస్తవమని, మంత్రి ప్రకటించింది అవాస్తమని వెల్లడైంది.

నియతకాలిక సర్వేతోపాటు 2018 ఏప్రియల్ నుండి డిసెంబర్ వరకు త్రైమాసికాలకు సంబంధించి పట్టణ ప్రాంతాల్లోని నిరుద్యోగిత పైన ఎన్‌ఎస్ఎస్‌ఓ అధ్యయనం చేసింది. అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో నిరుద్యోగిత రేటు 9.7శాతంగా నమోదైంది. ఈ సంస్థ సర్వేలోనే జూన్ 2018 నాటికి పట్టణప్రాంత నిరుద్యోగం 7.8% ఆ తర్వాత ఆరునెలల్లో 2 శాతం దాకా పెరిగింది. ప్రభుత్వం అనుసరించిన విధానాలతోపాటు పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి కూడా ఇందుకు దోహదపడింది. ఎన్‌ఎస్ఎస్‌ఓకు సమాంతరంగా దేశ ఆర్థికవ్యవస్థ పర్యవేక్షక కేంద్రం(సిఎంఐఈ)నిరుద్యోగితపై ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తున్నది. ఆ సంస్థ నివేదిక ప్రకారం జూన్ 9, 2019 నాటికి దేశంలో నిరుద్యోగిత 6.1 నుండి 7.7 శాతానికి పెరిగింది. ఇది త్రిపురలాంటి రాష్ట్రంలో 30 శాతంగా వుంది. ఈ సంస్థ అధ్యయనం ప్రకారం 2018 సం॥లో కోటిమందికి పైగా ఉపాధి కోల్పోయారు. వీరిలో 84శాతం గ్రామీణ ప్రజలే వుండటం వ్యవసాయ సంక్షోభ తీవ్రతకు అద్దంపడుతున్నది.

ఎన్‌ఎస్ఎస్‌ఓ సర్వేలో పేర్కొన్న అంశాలు కేంద్రప్రభుత్వానికి మింగుడుపడలేదు. సర్వే ఫలితాలు వ్యతిరేకంగా వున్నా, తను చెప్పిందే నిజమన్నట్లుగా వ్యవహరిస్తున్నది. దేశంలో నిరుద్యోగం గత 45 సం॥ల గరిష్టస్థాయికి చేరిందని చెప్పటం అందులో

భాగమే. ఎన్ఎస్ఎస్ఓ సర్వేకి ఎంచుకొన్న ప్రమాణాలను కేంద్రం శంకిస్తున్నది. గత సర్వేలతో, ఈ సర్వేను పోల్చగూడదంటున్నది. దేశంలో చదువుకొన్న, చదువుకొంటున్న వారు పెరిగారని, కుటుంబ ఆదాయాలు ఇనుమడించాయని, విద్యావంతులైన యువత ఆకాంక్షలు పెరుగుతున్నాయని, తన నైపుణ్యాలకు సరిపడని తక్కువ జీతాలు లభించే ఉద్యోగాల్లో చేరటానికి వారు ఆసక్తి చూపటం లేదని కేంద్రప్రభుత్వం చెప్పటం హాస్యాస్పదంగా వుంది. కేంద్రప్రభుత్వం చెప్పేదాని అర్థం ఉద్యోగాలు వున్నాయి కాని తక్కువ వేతనాలు లభించే ఉద్యోగాల్లో యువత చేరటంలేదని చెప్పటమే.

ఉద్యోగాలు దొరకటం కష్టమౌతున్న పరిస్థితుల్లో యువత ఏదో ఒక ఉద్యోగం దొరికితే చాలనుకొంటున్నది. కొద్దికాలం క్రితం పశ్చిమబెంగాల్‌లో ఆరువేల క్లాస్ - 4 ఉద్యోగాలకు 25 లక్షలమంది దరఖాస్తు చేసుకొన్నారు. ఈ ఉద్యోగాలకు ఎనిమిదవ తరగతి అర్హత చాలు. కాని పీజీలు, పిహెచ్‌డిలు చేసినవారు కూడా దరఖాస్తు చేశారు. ఉత్తరప్రదేశ్‌లో 368 బంట్రోతు ఉద్యోగాలకు 23 లక్షలమంది దరఖాస్తు చేయగా, వీరిలో లక్షన్నర మంది డిగ్రీ పట్టాదారులు, 250 మందికిపైగా డాక్టరేటు సాధించిన వారు వున్నారు. కర్ణాటక, మహారాష్ట్రల్లోనూ ఇలాంటి సంఘటనలు వున్నాయి.

వాస్తవలకు భిన్నంగా కేంద్రప్రభుత్వం ఉద్యోగ కల్పన లెక్కలు చెబుతున్నది. అందుకు తన అనుయాయులను ప్రయోగిస్తున్నది. ప్రధానమంత్రి ఆర్థిక సలహాసంఘం సభ్యుడు సుర్జిత్ ఎస్.భల్లా, ఐఐఎం బెంగుళూరుకు చెందిన తీర్థ తన్మయ్‌దాస్ 2018 జులై 9న ఓ అధ్యయన నివేదికను విడుదల చేశారు. అందులో 2014-17 సం॥ మధ్యకాలంలో దేశంలో 2.2కోట్ల ఉద్యోగాల సృష్టి జరిగిందని, 2017 సం॥లోనే 1.3 కోట్ల ఉద్యోగాలు కొత్తగా ఏర్పడ్డాయని లెక్కలు గట్టారు. సరైన ఆధారాలు, క్షేత్రస్థాయి పరిశోధన చేయకుండా రూపొందించిన ఆ నివేదిక తీవ్ర విమర్శలపాలైంది.

2018 జులై 20న అవిశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రధాని మోడీ నిరుద్యోగ సమస్యపై మాట్లాడుతూ సంవత్సరకాలంలో కోటికి పైగా ఉద్యోగాలు సృష్టించామని 2017 సెప్టెంబరు నుండి మే 2018 మధ్యలో 45 లక్షలమంది కొత్తగా ఉద్యోగులు భవిష్యనిధి సంస్థలో చేరారని, వీరికి జాతీయ పింఛను పథకం లబ్ధిదారులను కలిపితే 50 లక్షల ఉద్యోగాలను సృష్టించినట్లేగదా! కొత్తగా వచ్చిన వృత్తి నిపుణులు, స్వయం ఉపాధి పొందుతున్న వారు, అసంఘటితరంగ కార్మికులను కలిపితే కోటిమంది అవుతారని చెప్పారు. ప్రధాని చెప్పిన ఉద్యోగకల్పన లెక్కలు వాస్తవ విరుద్ధమైనవి. ఆ లెక్కలు ఉద్యోగ కల్పన క్రిందకు రావు. ఉద్యోగాల కల్పనలో వైఫల్యాన్ని కప్పిపుచ్చుకొనేదే మోడి లెక్కల గారడి.

2019 సాధారణ ఎన్నికల తేదీలకు రెండు నెలలముందు 2.5లక్షల ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు మోడి ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో 40శాతం ఉద్యోగాలు కేంద్ర పారా మిలటరీకి సంబంధించినవిగాను, 35 వేల ఉద్యోగాలు ఆదాయపు పన్నుశాఖవిగాను, 39 వేల ఉద్యోగాలు ఎక్సైజ్‌శాఖవిగానూ వుంటాయని ప్రకటించింది. ఉద్యోగ కల్పన స్వభావాన్ని గమనంలోకి తీసుకొంటే, ప్రజాఉద్యమాల అణచివేతకు ప్రాధాన్యతగల నియామకాలకు అగ్రపీఠం వేసింది. ఇవికాక రైల్వేశాఖలోనూ 2.3 లక్షల ఉద్యోగాలు భర్తీచేయనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రకటన ఎన్నికల్లో ప్రయోజనం పొందటానికి ఉపయోగించుకొంది. మోడి ప్రభుత్వం రెండవ సారి కొలువుదీరి మూడునెలలు కావస్తున్నా ఉద్యోగాల కల్పన ఊసే లేదు.

2014లో రాష్ట్ర అధికార పగ్గాలు చేపట్టిన తెలుగుదేశం ప్రభుత్వం సంవత్సరానికి 5 లక్షల ఉద్యోగాలు కల్పిస్తానన్న వాగ్దానాన్ని నెర వేర్చటంలో విఫలమైంది. కనీసం నిరుద్యోగ భృతికూడా చెల్లించలేకపోయింది. దాదాపు 1.50 వేల ఉద్యోగాలు ఖాళీ అయినా వాటిని కూడా భర్తీ చేయలేదు. కల్పించిన ఉద్యోగాలు కూడా ప్రజాఉద్యమాల అణచివేతకు అదనంగా కావాల్సిన పోలీసు ఉద్యోగాలను మాత్రం నియమించుకొంటూ వచ్చింది. టీచర్ పోస్టులకు అర్హతపొందిన వారికి ఉద్యోగ నియామకాలు చేపట్టలేదు. మోడిలాగానే చంద్రబాబు ఉద్యోగ లెక్కల గారడీనే చేశాడు.

చంద్రబాబు ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాల ఫలితంగా గత శాసనసభ ఎన్నికల్లో వైయస్ఆర్ సిపి పూర్తి మెజారిటీ సాధించి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అధికారంలోకి రాగానే ఖాళీ అయిన లక్షా 40వేల ఉద్యోగాలను భర్తీచేస్తానని, ప్రతి గ్రామ సచివాలయంలో 10 మందికి పర్మినెంట్ ఉద్యోగాలు, గ్రామీణ - పట్టణ ప్రాంతాల్లో 50 నుండి 70 కుటుంబాలకు ఒక వాలంటీర్‌ని నియమించి లక్షలాది ఉద్యోగాలు కల్పిస్తానని వాగ్దానం చేసింది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడునెలలు పూర్తికావస్తున్నా ఖాళీ అయిన ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకోలేదు. టీచర్ ఉద్యోగాలకు అర్హతపొందిన వారికి నియామకాలు జరపలేదు. గ్రామ, పట్టణ వాలంటీర్లకు, సచివాలయ ఉద్యోగాలకు మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేసింది. వాలంటీర్ నియామకాలను ఉద్యోగా లుగా పరిగణించలేము. 5 వేల వేతనంతో వెట్టిచాకిరీ చేయించటమే. దాని పేరుతో వారి అర్హతకు అనుగుణమైన ఉద్యోగాలకు వారికి దూరం చేయటమే.

కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు గత 5 సంవత్సరాల కాలంలో ఉపాధి - ఉద్యోగ అవకాశాలు కల్పించటంలో ఉద్దేశపూర్వకంగానే వైఫల్యం చెందాయి. పేదలకు ఉపాధి, యువతకు ఉద్యోగాలు కల్పించే పారిశ్రామిక విధానాలను అమలుజరపటంలేదు. బడా పరిశ్రమాధిపతులకు, బహుళజాతి సంస్థలకు చౌకగా కూలీలను, అతితక్కువ వేతనాలకు యువతను అందించే వ్యవసాయ, పారిశ్రామిక విధానాలను అమలు జరుపుతున్నాయి. వ్యవసాయం ముఖ్య భూమిక పోషిస్తున్న మనదేశంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ప్రజల అవసరాలను తీర్చే చిన్న, మధ్యతరహా పరిశ్రమల ద్వారానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. అలాంటి పారిశ్రామిక విధానం అమలు జరపకుండా నిరుద్యోగ సమస్యకు పరిష్కారం దొరకదు. విప్లవకర భూసంస్కరణలు అమలుజరపటం ద్వారా గ్రామీణ పేదలకు ఉపాధి ఏర్పడుతుంది. ఇందుకోసం గ్రామీణ-పట్టణ పేదలు సమైక్యంగా ఉద్యమించాలి.

ooo